క్లుప్తంగా

ఆచూకి చెప్పిన వారికి నజరానా



బాణోత్ బద్యా

చంద్రుగొండ: అదృశ్యం అయిన ఓ వ్యక్తి ఆచూకి చూపిన వారికి రూ.50 వేలు బహుమతిని కుటుంబ సభ్యులు ఇవ్వనున్నట్లు ఎస్ఐ గంజి స్వప్న సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని గుర్రాయిగూడెం గ్రామానికి చెందిన 76 ఏళ్ల వయస్సున్న బాణోత్ బద్యా 15 రోజుల క్రితం సామాన్లు తీసుకువస్తానని ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు అప్పట్లోనే కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేస్తున్నారు. ఇప్పటి వరకు అతడి ఆచూకి లభించకపోవడంతో కుటుంబీకులు రూ.50 వేల నగదు బహుమతి ప్రకటించారు.

ఆర్థిక విధానాలు ప్రమాదకరం

అశ్వారావుపేటరూరల్: కేంద్ర ప్రభుత్వ సరళీకరణ ఆర్థిక విధానాలు దేశానికి ప్రమాదకరంగా మారుతున్నాయని రాజకీయ విద్యా విభాగం రాష్ట్ర నాయకుడు బండారు రమేష్ అన్నారు. అశ్వారావుపేటలోని సత్యసాయి కల్యాణ మండపం ఆవరణలో రెండు రోజుల పాటు నిర్వహించే జిల్లా స్థాయి శిక్షణా తరగతులను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బూర్జువా, వ్యాపార విధానాలతో ప్రైవేట్, పెట్టుబడిదారి వ్యాపారులు దేశ ప్రకృతి సహజ వనరులను లూటీ చేస్తున్నారని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు కార్మిక వర్గంపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతుందని, దీంతో పోరాడి సాధించుకున్న హక్కులు, సౌకర్యాలను కోల్పోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు కొలగాని బ్రహ్మచారి, జిలకర పద్మ, పిట్టల అర్జున్, గద్దల శ్రీనివాసరావు, దొడ్డా రవికుమార్, వీరన్న, భూక్యా రమేష్ పాల్గొన్నారు.

మురుగు నిల్వతో దుర్గంధం



డ్రైయిన్‌లో నిలిచిన మురుగునీరు

చంద్రుగొండ: మండలకేంద్రం చంద్రుగొండలోని జూలూరుపాడు రోడ్డు డ్రైయినేజీలో ముగురు నిల్వ ఉండడంతో దుర్గంధం వెదజల్లుతోంది. రోడ్డుకు ఇరువైపులా డ్రైయిన్‌ల నిర్మాణానికి ప్రభుత్వం రూ. 3.12 కోట్లు నిధులు మంజూరు చేసింది. అయితే కొంత మంది వ్యాపారులు, గృహసముదాయాలున్న వారు తమకు జరుగుతున్న నష్టానికి పరిహారం ఇచ్చిన తరువాతే డ్రైయిన్‌ల నిర్మాణం చేపట్టాలని కోర్టును ఆశ్రయించారు. అయితే అభ్యంతరం లేని చోట డ్రైయిన్‌ల నిర్మాణ పనులు సాగుతున్నాయి. ఈ క్రమంలో ప్రతిభ విద్యాలయం వరకు ఓ వైపు డ్రైయిన్ నిర్మాణం పూర్తి అయింది. అదే ప్రాంతంలో ఉన్న భవన యజమాని స్టే తేవడంతో అక్కడ పనులు నిలిచిపోయాయి. దీంతో పాఠశాల ప్రాంతంలో ముగురు నిల్వతో దుర్గంధం వెదజల్లుతోంది. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డులో దుర్గంధంతో ప్రజలు, పాఠశాల విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. సమస్యను సత్వరమే పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పోగొట్టుకున్న చెవి బుట్ట అందజేత

భద్రాచలంటౌన్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన భద్రాచలం గోదావరి నదిలో పుణ్య స్నానానికి వచ్చిన ఒక భక్తురాలి చెవిబుట్ట నదిలో పోగా.. అక్కడే ఉన్న గజ ఈతగాళ్లు వెతికి అందజేశారు. ఖమ్మం పట్టణానికి చెందిన మౌనికతో పాటు మరో ఇద్దరు కార్తీక సోమవారం సందర్భంగా గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించేందుకు భద్రాచలం వచ్చారు. నదిలో స్నానాలు ఆచరిస్తున్న క్రమంలో మౌనిక చెవి బంగారు బుట్ట నదిలో పడిపోయింది. దీంతో స్థానిక గజ ఈతగాళ్లకు సమాచారం ఇవ్వగా ఈతగాడు ప్రసాద్ బంగారు బుట్టను వెతికి బాధితురాలికి అందజేశారు. బాధితులు ప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

నాగేంద్రస్వామికి పూజలు

అశ్వారావుపేటరూరల్: మండల కేంద్రంలోని డ్రైవర్స్ కాలనీ గ్రామంలో ఉన్న స్వయంభు నాగేంద్రస్వామి ఆలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచే భక్తులు స్వామి వారి ఆలయానికి చేరుకుని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నసమారాధన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయగా.. అన్నదాన కార్యక్రమాన్ని మాజీ ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి చేతుల మీదుగా ప్రారంభించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పాల్గొన్నారు.

ప్రతి గింజనూ ప్రభుత్వం కొంటుంది..

- రైతులు దళారులను ఆశ్రయించొద్దు
- కొనుగోలు కేంద్రాల ప్రారంభంలో ఎమ్మెల్యే పాయం



బూర్గంపాడు: మోరంపల్లిబంజరలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకటేశ్వర్లు

బూర్గంపాడు: రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వం తప్పకుండా కొనుగోలు చేస్తుందని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మోరంపల్లిబంజర గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఏడీఏ తాతారావు, తహసీల్దార్ ముజాహిద్, ఎంపీడీఓ జమలారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు,ఏఓ శంకర్, పీఏసీఎస్ సీఈఓ ప్రసాద్, తిరుపతిరెడ్డి, ఉమర్, మాజీ సొసైటీ చైర్మన్ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఆజాద్ జయంతి..

మండల కేంద్రం బూర్గంపాడు, సారపాకలలోని ప్రభుత్వ మైనారిటీ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలల్లో మౌలానా అబుల్ కలాం ఆజాద్ 136వ జయంతిని నిర్వహించగా.. ఎమ్మెల్యే పాయం పాల్గొని మాట్లాడారు. అనంతరం బూర్గంపాడు, సారపాకలలో రూ.8లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు ఆయన అందజేశారు. బూర్గంపాడుకు చెందిన సీనియర్ నాయకుడు దుద్దుకూరి కృష్ణ అనారోగ్యానికి గురైన విషయం తెలిసి ఆయనను పరామర్శించారు. ప్రమాదంలో గాయపడి మృతిచెందిన 8 ఏళ్ల భార్గవ్ తేజ కుటుంబసభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు. కార్యక్రమాల్లో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దుగ్గెంపూడి కృష్ణారెడ్డి, భజన ప్రసాద్, మందా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మణుగూరుటౌన్: ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని, రైతులు దళారులను నమ్మకుండా నేరుగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే అమ్ముకోవాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం మండలంలోని రామానుజవరంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించి ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాఘవరెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాస్, ఏడీఏ తాతారావు, సొసైటీ చైర్మన్ కుర్రి నాగేశ్వరరావు, సీఈఓ జ్ఞానదాసు, రైతులు సొసైటీ డైరెక్టర్ మామిడిపల్లి సీతారాములు, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొల్లోజు అయోధ్య, మణుగూరు మండల అధ్యక్షుడు పీరినాకి నవీన్, నాయకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం



కరకగూడెం: మాట్లాడుతున్న సాబీర్ పాషా

కరకగూడెం: ప్రజా సమస్యల పరిష్కారమే సీపీఐ ముఖ్య లక్ష్యమని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి షేక్ సాబీర్ పాషా అన్నారు. ఈ మేరకు ఆయన సోమవారం మండల పరిధిలోని చొప్పలా గ్రామంలో పార్టీ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. అధికారం కోసం కాకుండా పేద ప్రజల కోసం నిజాయతీగా పనిచేసేది కమ్యూనిస్టులేనని అన్నారు. కమ్యూనిస్టు పార్టీలు పేదలు, కార్మికుల హక్కుల కోసం పోరాటం చేస్తాయని, భూమి పంపిణీ,సమానత్వం వంటి అంశాలపై పోరాటాలు చేశాయని గుర్తుచేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అయోధ్య, మండల కార్యదర్శి వంగరి సతీష్, నాయకులు పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంక్ వార్షికోత్సవం



చర్ల: ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మాట్లాడుతున్న మేనేజర్ సందీప్

అశ్వారావుపేటరూరల్: యూనియన్ బ్యాంక్ 106వ వార్షికోత్సవ వేడుకలను సోమవారం అశ్వారావుపేట బ్రాంచ్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. బ్రాంచ్ డిప్యూటీ మేనేజర్ నాగబాబు, బ్యాంక్ ఆర్డీఓ శ్రీధర్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ఖాతారులకు, తోటి ఉద్యోగులు, సిబ్బందికి అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఖాతాదారులతోనే బ్యాంకు అభివృద్ధి సాధ్యమని అన్నారు. స్థానిక బ్రాంచ్ ద్వారా ఏటా రూ.230 కోట్లతో టర్నోవర్ సాగుతుందని, దీంట్లో రూ.102 కోట్లు డిపాజిట్‌లు కాగా.. రూ.128 కోట్లు రుణాల రూపంలో లావాదేవిలు సాగుతున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ రంజిత్‌బాబు, రైతు సంఘం నాయకులు పిన్నమనేని మురళి, బ్యాంక్ సిబ్బంది హారిక, జరీనా, మాధవి, సునీత, సతీష్, ఖాతాదారులు పాల్గొన్నారు.

చర్ల: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆవిర్భావ దినాన్ని సోమవారం చర్లలో ఘనంగా నిర్వహించారు. స్థానిక యూబీఐ బ్యాంకులో మేనేజర్ కె.సందీప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. ఈ సందర్భంగా మేనేజర్ సందీప్ మాట్లాడుతూ.. దేశంలో ఖాతాదారులకు మెరుగైన సేవలనందించడంలో యూనియన్ బ్యాంక్ మొదటి వరుసలో ఉందన్నారు. సేవలను మరింతగా విస్తరించేందుకు సంస్థ కృషి చేస్తోందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేనేజర్ రమాదేవి, బ్యాంక్ సిబ్బంది మణికంత, శ్రీకాంత్, సందీప్, రాము, శేషు, ఖాతాదారులు కొత్తపల్లి ఆంజనేయులు, నల్లూరి పాండురంగారావు, సూర్య ప్రభావతి, వేల్పూరి వెంకటమరణ, బ్యాంకు మిత్రలు తలసి, సమ్మక్క పాల్గొన్నారు.

శివాలయాల్లో కార్తీక పూజలు



అశ్వారావుపేటరూరల్: శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



అన్నపురెడ్డిపల్లి (చంద్రుగొండ): అన్నదానంలో పాల్గొన్న భక్తజనం

అశ్వారావుపేటరూరల్: కార్తీక మాసం నేపథ్యంలో పలు శివాలయాల్లో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని వినాయకపురం, కొత్త మామిళ్లవారిగూడెం, అశ్వారావుపేటలోని శివాలయాల్లో భక్తులు స్వామి వారిని దర్శించుకుని వివిధ రకాల పూజలు చేశారు. అలాగే శివలింగాలకు అర్చకుల ఆధ్వర్యంలో అభిషేకాలు నిర్వహించి, నైవేద్యాలు సమర్పించారు. కోనేరుబజారు శివాలయంలో అన్నపూర్ణ విశ్వేశ్వరస్వామి ఆలయంలో పాలు, పెరుగు, నెయ్యి, పంచదార, తేనె విభూది పసుపు కుంకుమ గంధం పన్నీరుతో అభిషేకాలు చేశారు. మధ్యాహ్న సమయంలో భక్తులకు అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించగా భక్తులు పాల్గొన్నారు. అలాగే అశ్వారావుపేటలోని శ్రీ కన్యకాపరమేశ్వరి ఆలయం వద్ద కుడా మహిళలు పూజలు చేసి భక్తిశ్రద్ధలతో దీపాలు వెలిగించారు. దీంతో ఆలయ వద్ద సందడి నెలకొంది.

ములకలపల్లి: కార్తీక మాసం రెండో సోమవారం నేపథ్యంలో శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజామునుండే భక్తులు ఆలయాలకు చేరుకుని పూజలు చేశారు. మహిళలు దీపాలు వెలిగించి భక్తిని చాటుకున్నారు. నైవేద్యాలు సమర్పించారు. శివలింగాలకు సామూహిక అభిషేకాలు చేశారు. ములకలపల్లిలో పాత శివాలయంలో ముకందల సత్యనారాయణశాస్త్రి, నూతన ఉమా పృథ్వీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో విస్సావజ్జుల సురేశ్ శర్మలు కార్తీక మాస పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

అన్నపురెడ్డిపల్లి (చంద్రుగొండ): మండలకేంద్రం అన్నపురెడ్డిపల్లిలోన శ్రీభ్రమరాంబ సమేత మల్లిఖార్జున స్వామి ఆలయం కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని భక్తులతో కిటకిటలాడింది. వేకువజామునే ఆలయాన్ని సందర్శించిన భక్తులు ప్రాంగణంలో కోనేరులో పవిత్ర స్నానాలు ఆచరించారు. అనంతరం స్వామివారి సన్నిధిలో పూజలు చేశారు. అర్చనలు, అభిషేకాలు చేశారు. కార్తీకదీపాలు వెలిగించారు. ఆలయ మేనేజర్ పీవీ రమణ భక్తులు ఏర్పాటు చేశారు. అనంతరం అన్నదానం చేశారు.

చర్యలు తీసుకోవాలి

దుమ్ముగూడెం: లక్ష్మీనగరం గ్రామంలోని ఏకలవ్య మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్, వార్డెన్‌లపై తక్షణమే చర్యలు తీసుకోవాలని మాజీ సర్పంచ్ కణితి సమ్మయ్య, ఆదివాసీ యువ నాయకుడు కోడి చంటి ఆదివారం డిమాండ్ చేశారు. పురుగుమందు తాగి ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న బాధిత ధనలక్ష్మిని వారు పరామర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. సరైన విచారణ చేయకుండా విద్యార్థినిని మందలించిన ప్రిన్సిపల్, వార్డెన్, సిబ్బంది, హాస్టల్ నుంచి ఇంటికి పంపించిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.

దమ్మపేటలో రెండు తలల పాము



పామును పట్టుకున్న విజయమారుతి శర్మ

దమ్మపేట: మండల కేంద్రం దమ్మపేట గ్రామంలో రెండు తలకాయల పాము ప్రత్యక్షమైంది. దమ్మపేట గ్రామ శివారులోని కల్యాణ మండపం సమీపంలోని ఖాళీ ప్రదేశంలో సోమవారం ఈ పాము సంచరించడం స్థానికుల కంట పడింది. దీంతో అదే ప్రాంతంలో నివాసం ఉంటున్న కామవరపు విజయమారుతి శర్మకు విషయం తెలపగా.. ఆయన ఆ పామును పట్టుకున్నారు. అనంతరం దమ్మపేట ఫారెస్టు సిబ్బందికి అందజేశారు. పామును ముష్టిబండ శివారులోని అడవి ప్రాంతంలో వదిలేయాలని సిబ్బందికి సూచించినట్లు రేంజర్ కరుణాకర్ చారి తెలిపారు.

క్రీడల్లో రాణించాలి

పినపాక: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో సైతం ఉన్నతంగా రాణించాలని పిన్నపాక మండల ఎంఈఓ నాగయ్య సూచించారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని బయ్యారం సెయింట్ మేరీస్ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడిన ఆయన విద్యార్థులు ఒక లక్ష్యం ఏర్పాటు చేసుకుని ముందుకు సాగాలని సూచించారు. ప్రిన్సిపాల్ రేజిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రత్యేక సెల్ ఏర్పాటు చరిత్రాత్మకం

మణుగూరుటౌన్: ఎస్సీ, ఎస్టీ కార్మిక సమస్యల పరిష్కారం కోసం కొత్తగూడెం రీజియన్ కింద కార్పొరేట్ ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయడం సంతోషకరమైన అంశమని టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. నవంబర్ 12వ తేదీన కొత్తగూడెం కార్పొరేట్‌లో ఏర్పాటు చేసిన ఎస్సీ, ఎస్టీ లైజన్ సెల్ ప్రారంభం చేయడానికి రానున్న సీఎండీ బలరాం, డైరెక్టర్(పా) వెంకటేశ్వరరెడ్డి, తెలంగాణ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ చైర్మన్ భక్కివెంకటయ్య, కమిషన్ సభ్యులు రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. సెల్ ప్రారంభానికి కృషి చేసిన ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్థిక సాయం

చర్ల: మండల కేంద్రంలోని అంబేడ్కర్ నగర్‌లో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో ఇళ్లు దగ్ధమయ్యి నిరాశ్రయులైన మీసాల సమ్మయ్య కుటుంబానికి బీఆర్ఎస్ నేతలు ఆర్థిక సాయాన్ని అందించారు. పార్టీ మండల కన్వీనర్ దొడ్డి తాతారావు సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేల నగదుతో పాటు నిత్యావసర వస్తువులను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఎస్.డి.అజీజ్, అంకాల శ్రీనివాసరావు, పంజా రాజు, సృజన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులపై దాడికి ఖండన



మణుగూరుటౌన్: నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న తహసీల్దార్, ఉద్యోగులు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట టీఎన్జీఓస్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉద్యోగులపై దాడిని ఖండిస్తూ నల్ల బాడ్జీలతో సోమవారం నిరసన వ్యక్తం చేశారు. టీఎన్జీవోస్ జనరల్ సెక్రెటరీ గగ్గూరి బాలకృష్ణ మాట్లాడుతూ.. వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచర్ల గ్రామంలో ఫార్మా కంపెనీ ఏర్పాటు కోసం ప్రజాభిప్రాయల సేకరణకు వెళ్లిన ఆ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, కొడంగల్ డెవలప్మెంట్ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డితో పాటు తదితర ఉద్యోగులపై అమానుషమైన దాడిని తెలంగాణ ఉద్యోగులు ఖండించాలన్నారు. ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లిన సాక్షాత్తు జిల్లా కలెక్టర్‌తో పాటు ఇతర ఉద్యోగస్తులపై దుండగులు తీవ్రంగా దాడి చేసి గాయపరిచిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఉద్యోగులు నరసింహారావు, బిక్కులాల్, గోపాలకృష్ణ, చిరంజీవి, టీఎన్జీఓ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉషా, యూటీఎఫ్ రాజు, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

ములకలపల్లి: వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్‌పై జరిగిన దాడి ఘటనపై సమగ్ర విచారణ జరపాలని ఆదివాసీ సేన రాష్ట్ర నాయకులు, న్యాయవాది ఊకే రవి సోమవారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామసభలో కలెక్టర్‌పై దౌర్జన్యానికి పాల్పడడం హేయమైన చర్య అని అన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని అన్నారు.

మణుగూరురూరల్: వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌పై అదే జిల్లా దుద్యాల మండల లగచర్ల రైతులు, గ్రామస్తులు పాల్పడిన చర్య సరికాదని టీజీఓఎస్ రాష్ట్ర అధ్యక్షుడు, మణుగూరు ఎంపీడీఓ టి.శ్రీనివాసరావు తెలిపారు. ప్రజాభిప్రాయానికి వెళ్లిన జిల్లా కలెక్టర్ గ్రామస్తులు ఇలాంటి చర్యకు పాల్పడడాన్ని తాము ఖండిస్తున్నామన్నారు.

మణుగూరుటౌన్: వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌పై ప్రజల దాడిని ఖండిస్తూ మణుగూరు మండల తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది సోమవారం నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రాఘవరెడ్డి మాట్లాడుతూ.. వికారాబాద్ జిల్లాలో దుద్యాల మండల లగచర్లలో ఫార్మాసిస్ట్ కంపెనీ ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లిన అధికారులపై దాడులు జరపడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీజీటీఏ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

నిత్యావసరాలు పంపిణీ



బాధిత కుటుంబాలకు నిత్యావసరాలు అందజేస్తున్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు

దుమ్ముగూడెం: మండలంలోని లచ్చిగూడెం గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన బాధిత కుటుంబాలు మిడియం రాజేష్, మిడియం సవితలకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు నిత్యావసరాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని, ప్రభుత్వ తరుపున సహాయసహకారాలు అందేలా చర్యలు తీసుకుంటామనిన్నారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యుడు భీమవరపు వెంకటరెడ్డి, సూర్యనారాయణ, నాగేశ్వరరావు, ఎస్ఐ వెంకటప్పయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ కిట్ అందజేత



వాలీబాల్ కిట్ అందజేస్తున్న ఎస్సై ప్రసాద్

మణుగూరురూరల్: మండల పరిధిలోని వలస ఆదివాసీ గ్రామమైన ఖమ్మం తోగుబుగ్గ యువకులు మణుగూరు పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఎస్సై మేడ ప్రసాద్ వాలీబాల్ కిట్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత చెడు వ్యసనాలకు, అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, సన్మార్గంలో పయనిస్తూ విద్యలో, క్రీడలలో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

50 ఏళ్ల తర్వాత సమ్మేళనం!



సమావేశమైన పూర్వ విద్యార్థులు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని ఎస్ఆర్ ఎస్ఏయూపీ (గుట్టమీద స్కూల్) పాఠశాలలో 1975 నుంచి 1982 వరకు సుమారు 50 ఏళ్ల క్రితం 1 నుంచి 7 వరకు చదువుకున్న పూర్వ విద్యార్థులు సోమవారం కలుసుకున్నారు. స్థానిక వేగిసిన శ్రీనివాసరాజు మామిడి తోటలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చి కలుసుకున్న పూర్వ విద్యార్థులు ఒకరికొకరు ఆలింగనం చేసుకుని అప్పటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. రోజంతా ఆనందంగా గడిపారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు తమ మధ్య లేకపోవడంతో వారికి రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధి కోసం ఓ కమిటీ వేసి నిధులు సేకరించి పాఠశాల యాజమాన్యనికి ఇవ్వాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో చక్కా రాము, కొడాలి శ్రీనివాసన్, తాతినేని శ్రీనివాస్, కుంచాల రమేష్, బచ్చు విజయ్ తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాలు మెరుగుపరుచుకోవాలి

మణుగూరుటౌన్: విద్యార్థులు శిక్షణా నైపుణ్యాలు మెరుగుపరుచుకోవాలంటే అప్రెంటీస్ తప్పనిసరి అని ఐటీఐ ప్రిన్సిపాల్ బడుగు ప్రభాకర్ అన్నారు. సోమవారం ప్రభుత్వ ఐటీఐలో సోమవారం నిర్వహించిన నేషనల్ అప్రెంటీస్ మేళాలో ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు అప్రెంటీస్ అవకాశాలు కల్పించడం కోసమే ఇటువంటి మేళాలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం హైదరాబాద్ నుంచి వచ్చిన వివిధ కంపెనీల వారు వారికి కావాల్సిన విద్యార్థులను ఎంపిక చేసుకున్నారు. 50 మంది అప్రెంటీస్‌లో పాల్గొనగా, 26 మందిని అప్రెంటీస్‌కు ఎంపిక చేసినట్లు తెలిపారు. కృష్ణసాగర్ ఐటీఐ ప్రిన్సిపాల్ ధర్మాచారి, మణుగూరు ఐటీఐ ట్రెనింగ్ ఆఫీసర్ రవి, ఏటీఓలు జీవీ కృష్ణారావు, ఎం.శ్రీనివాసరావు, ఏ.నర్సయ్య, వేణుగోపాల్ నాయుడు, వీఎల్ఆర్ కంపెనీ ప్రతినిధులు ధర్మ పాల్గొన్నారు.

అబుల్ కలాం ఆజాద్ జయంతి



అశ్వారావుపేటరూరల్: ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎంఈఓ ప్రసాద్‌రావు

అశ్వారావుపేటరూరల్: స్థానిక మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్‌లో సోమవారం మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మైనారిటీ జూనియర్ కళాశాల, స్కూల్ సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముందుగా దేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ప్రిన్సిపాల్ సంగీత అధ్యక్షత జరిగిన సమావేశంలో పలువురు వక్తలు మాట్లాడుతూ.. మైనారిటీ విద్యార్థుల అభ్యున్నతి, మెరుగైన బోధన అందించేందుకు ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా విద్య, క్రీడా రంగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు, జ్ఞాపికలను అందించారు. అనంతరం విద్యార్థునులు ఆట, పాటలతో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణ ప్రసాద్, ఎంఈఓ ప్రసాద్‌రావు, హైస్కూల్ హెచ్ఎం హరిత, సదర్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్‌కె.వలిపాషా, ఎండి.నజీర్ పాషా, అధ్యాపకులు, విద్యార్థునులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చంద్రుగొండ: మండలకేంద్రం చంద్రుగొండలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం స్వాతంత్ర సమరయోధుడు, భారతరత్న అబుల్ కలాం ఆజాద్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన దేశం కోసం చేసిన త్యాగాలను శ్లాఘించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బయ్యారపు అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.

కరకగూడెం: భారతరత్న డాక్టర్ మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలను సోమవారం మండలంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో ఘనంగా జరిపారు. ఈ మేరకు స్థానిక తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్ నాగ ప్రసాద్ అబుల్ కలాం చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను స్మరించుకున్నారు.ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ స్కూల్‌కు వితరణ

మణుగూరురూరల్: మైనార్టీ సంక్షేమ దినోత్సవాన్ని అధికారికంగా ప్రకటించడం పట్ల కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకులు సోమవారం హర్షం వ్యక్తం చేశారు. భారత రత్న కేంద్ర మాజీ విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం జయంతి సందర్భంగా బొంబాయికాలనీలో మదర్సా అమీర దారుల్ కురాన్ మైనార్టీ స్కూల్‌లో 25కేజీల బియ్యం, మిఠాయిలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మైనార్టీ జిల్లా కార్యదర్శి ఎండి.గౌస్ పాషా, పార్టీ మండల అధ్యక్షుడు పీరినాకి నవీన్, మైనార్టీ నాయకులు ఎండి రహీంపాషా, ఎండి లతీఫ్, పల్లం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.